

కరూర్ దుర్ఘటనపై సిట్ విచారణ ప్రారంభం

- బుస్సీ ఆనంద్ సహా ముగ్గురి కోసం గాలింపు
- విజయ్ ప్రచార వాహనం స్వాధీనం?



టీవీకే నేత బుస్సీ ఆనంద్

విజయ్ ప్రచార వాహనం



టీవీకే నేత ఆదవ్ అర్జున

టీవీకే నేత నిర్మల్ కుమార్

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వు ప్రకారం కరూర్ దుర్ఘటనపై నార్త్ జోన్ ఐజీ అస్రా గార్గ్ నాయకత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శనివారం విచారణ ప్రారంభించింది. అదే సమయంలో ఈ బృందంలో శ్యామలాదేవి, విమలా అనే ఇద్దరు మహిళా ఎస్పీలు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితోపాటు మరికొంతమంది ఏడీఎస్పీలు, డీఎస్పీలను కూడా సభ్యులుగా చేర్చనున్నారు. కరూర్ వేలుచ్చామిపురం వద్ద గత శనివారం రాత్రి టీవీకే నేత విజయ్ జరిపిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 56 మంది గాయపడి కరూర్ ప్రభుత్వ ఆసుపత్రి సహా వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో నార్త్‌జోన్ ఐజీ అస్రా గార్గ్ నాయకత్వంలో మద్రాసు హైకోర్టు శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆ బృందం శనివారం ఉదయం చెన్నై నుంచే విచారణ ప్రారంభించింది. కరూర్ దుర్ఘటనపై పలు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్న ఏడీఎస్పీ ప్రేమానంద్ అన్ని ఫైళ్లను ఐజీ అస్రా గార్గ్‌కు శనివారం అప్పగించారు. అప్పటికే ఆయన దర్యాప్తును ప్రారంభించి వేలుచ్చామిపురం వద్ద విజయ్ రోడ్‌షో సందర్భంగా సీసీ ఫుటేజీ పరిశీలించారు.

పరారీలో బుస్సీ ఆనంద్...

ఇదిలా ఉండగా కరూర్ దుర్ఘటన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్ళిన టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, పార్టీ నాయకులు ఆదవ్ అర్జున, నిర్మల్‌కుమార్‌లకు హైకోర్టు బెయిలు నిరాకరించడంతో ఆ ముగ్గురి అరెస్టు చర్యలు చేపట్టమంటూ కరూర్ పోలీసులకు ఐజీ అస్రాగార్గ్ ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ముగ్గురిని కోసం మూడు ప్రత్యేక పోలీసు దళాలు గాలింపు చర్యలను ప్రారంభించాయి. పార్టీ నాయకుడు ఆదవ్ అర్జున డెహ్రాడూన్‌లో ఉన్నట్లు టీవీ ఛానెళ్లలో వీడియో వెలువడింది. దీంతో ఓ ప్రత్యేక బృందాన్ని డెహ్రాడూన్‌కు పంపాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. కాగా డిప్యూటీ ప్రధానకార్యదర్శి నిర్మల్ కుమార్‌ను కూడా అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక బుస్సీ ఆనంద్ రామేశ్వరంలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు హుటాహుటిన వెళ్ళారు.

ప్రచార వాహనం స్వాధీనానికి చర్యలు...

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విజయ్ ప్రచార వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడానికి సిట్ చర్యలు ప్రారంభించింది. నామక్కల్‌లో ప్రచారం ముగించుకుని విజయ్ తన ప్రచార వాహనంలో వస్తుండంగా ఆ వాహనాన్ని వందమందికిపైగా యువకులు బైకులతో అనుసరించారు.. ఆ సందర్భంగా విజయ్ ప్రచార వాహనం ఢీకొని మూడు బైకులు అదుపుతప్పి రోడ్డుపై దొర్లిపడ్డాయి. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వీక్షించిన హైకోర్టు న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ బైకులను ఢీకొట్టిన విజయ్ ప్రచార వాహనాన్ని పోలీసులు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని, విజయ్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు నగరంలోని పయ్యనూరు వద్ద విజయ్ నివాసం సమీపంలో ఉన్న ప్రచార వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు ప్రారంభించారు.

ప్రమాద స్థలంలో పాదరక్షల తొలగింపు...

టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా వేలుచ్చామిపురం వద్ద తొక్కిసలాట జరిగిన ప్రాంతం వద్ద వారం రోజులుగా వందల సంఖ్యలో పడి ఉన్న పాదరక్షలు, పార్టీ తువ్వాళ్లను శనివారం ఉదయం కరూర్ పారిశుధ్య కార్మికులు తొలగించారు. కరూర్ విషాద సంఘటనపై పలు పార్టీల నిజనిర్ధారణ కమిటీలు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ అరుణా జగదీశన్ కమిటీ క్షేత్ర పరిశీలనకు రావటంతో పోలీసులు ఆ ప్రాంతంలో పడి వున్న పార్టీ తువ్వాళ్లను, పాదరక్షలను, మైక్‌బాక్స్‌లను తొలగించలేదు.. ప్రస్తుతం నిజనిర్ధారణ కమిటీల విచారణలు పూర్తయిన నేపథ్యంలో వాటిని తొలగించారు.

పరస్పర ఆరోపణలు వద్దు పరిష్కారం దిశగా పయనిద్దాం

- కరూర్ విషాదంపై సీఎం స్టాలిన్ పిలుపు



సీఎంతో భేటీ అయిన వందవాసి అసెంబ్లీ నియోజకవర్గ డీఎంకే నాయకురాలు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కరూర్‌లో సంభవించిన విషాద సంఘటనపై ఒకరిపైనొకరు ఆరోపణలు చేసుకోవడం మానుకోవాలని, భవిష్యత్తులో అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పరిష్కార దిశగా పయనిద్దామని రాజకీయ పార్టీల నేతలకు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీఎం శనివారం తన ఎక్స్‌పేజీలో ఓ ట్వీట్ చేశారు. కరూర్ విషాద ఘటనకు సంబంధించి హైకోర్టు ఆదేశాలను, మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. కరూర్ విషాదంతో అందరి పరిస్థితి హృదయ విదారకంగా ఉందని, తమ ఆత్మీయులను, ప్రియమైనవారిని కోల్పోయిన ప్రతి కుటుంబం కార్చిన కన్నీళ్లను చూసి తాను చాలా బాధపడ్డానని స్టాలిన్ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ప్రారంభించనుందని, ఆ విచారణ ద్వారా ప్రజలకు వాస్తవాలు వెల్లడవుతాయన్నారు. దేశంలో పలు కీలకమైన నూతన అంశాలకు, విధానాలకు ఆదర్శంగా ఉన్న రాష్ట్రం.. రాజకీయ పార్టీల సభలు, ర్యాలీల్లో తొక్కిసలాట వంటి ప్రమాదాలను నిరోధించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాల మేధావులు, నిపుణులు, రాజకీయ పార్టీలు, పౌరులతో సంప్రదించి, ఓ సంపూర్ణమైన విధివిధానాలను రూపొందిస్తామని ఈ సందర్భంగా స్టాలిన్ తెలిపారు. కరూర్ విషాదం నుండి ఇంకా కోలుకోని నేపథ్యంలో రాజకీయ లబ్ధికోసం ఒకరినొకరు నిందారోపణలకు పాల్పడకుండా దీర్ఘకాలిక పరిష్కారం వైపు ముందుకు సాగుదామని ఆయన హితవు పలికారు. ఈ ఉమ్మడి ప్రయత్నంలో అందరి సలహాలు, సూచనలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాణం విలువైనది, కరూర్ వంటి ఘటనలు దేశంలో ఎక్కడా జరుగకుండా నిరోధించడానికి అందరూ కలిసికట్టుగా ఐకమత్యంగా పాటుపడదామని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇదిలా వుండగా శనివారం ఆరూర్, వందవాసి అసెంబ్లీ నియోజకవర్గాల డీఎంకే నేతలు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అయ్యారు. తమ నియోజకవర్గాల్లో బలబలాలను స్టాలిన్‌కు వివరించారు.

అవసరమైతే విజయ్‌నూ అరెస్ట్ చేస్తాం

- మంత్రి దురైమురుగన్



'నలం కాక్కుం స్టాలిన్' వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరూర్ ఘటనలో అవసరమైతే టీవీకే అధినేత విజయ్‌ను కూడా అరెస్ట్ చేస్తామని, చట్టం ముందు అంతా సమానమేనని మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. సేర్కాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యలు చేపట్టామని, ఎంతటి వర్షం కురిసినా ప్రజలకు ఇబ్బంది కలగవన్నారు. కరూర్ ఘటనలో న్యాయస్థానం అభిప్రాయాలను అందరూ గౌరవించాలన్నారు. వాస్తవ పరిస్థితులను న్యాయమూర్తి వివరించారన్నారు. రాబోయే ఎన్నికల్లో 200 స్థానాల్లో గెలుస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెబుతున్నారని, నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ కూడా 234 స్థానాల్లో గెలుస్తామంటున్నారని, ఆ విషయం ఎన్నికల తర్వాత తెలుస్తుందన్నారు. కళ్లకుర్చి ఘటనపై స్పందించని ముఖ్యమంత్రి స్టాలిన్, కరూర్‌కు మాత్రం ఎందుకు వెళ్లారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయని, కళ్లకుర్చి ఘటన కరూర్ ఘటన ఒకటి కాదన్నారు. కరూర్ ఘటన దేశాన్ని దిగ్భ్రాంతి చేసిందన్నారు. అమాయక ప్రజలు మృతిచెందారని తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్.. రాత్రికి రాత్రే కరూర్ చేరుకొని మృతుల కుంబాలను ఓదార్చడంతో పాటు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా స్వయంగా పర్యవేక్షించారని తెలిపారు. కరూర్ ఘటనకు సంబంధించి అన్యాయంగా ఎవరినీ అరెస్ట్ చేయబోమని, చట్ట ప్రకారం అవసరమైతే విజయ్‌ను అరెస్ట్ చేస్తామని మంత్రి దురైమురుగన్ తెలిపారు.

కరూర్ దుర్ఘటనపై ఎన్సీఎస్సీ విచారణ



గురువిష్ణు కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఎన్సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానా, ఇతర సభ్యులు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా వేలుచ్చామిపురంలో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నేత విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో 41 మంది మృతి చెందిన ఘటనపై షెడ్యూలు కులాల సంక్షేమ జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) విచారణ ప్రారంభించింది. తొక్కిసలాట మృతుల్లో 13 మంది షెడ్యూలు కులాల వారున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ షెడ్యూలు కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా నేతృత్వంలోని బృందం కరూర్ విషాద సంఘటపై విచారణ జరిపేందుకు శుక్రవారం రాత్రి ఆ ప్రాంతానికి వెళ్ళింది. శనివారం ఉదయం 10 గంటలకు టీవీకే రోడ్‌షోలో తొక్కిసలాట జరిగిన వేలుచ్చామిపురం ప్రాంతాన్ని పరిశీలించింది. ఆ తర్వాత కరూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంది. ఆ తరవాఅత తొక్కిసలాటలో అధిక సంఖ్యలో మృతి చెందిన బలహీనవర్గాలవారు నివసిస్తున్న ఏమూరుపుదూరు గ్రామానికి ఈ బృందం వెళ్లి తొక్కిసలాటలో మృతి చెందిన అరుక్కాణి కుటుంబ సభ్యులు సహా ఐదుగురిని విచారణ జరిపారు. అదే విధంగా దుర్ఘటనలో మృతి చెందిన వేలుచ్చామిపురానికి చెందిన రెండేళ్ల బాలుడు గురువిష్ణు ఇంటికి వెళ్ళిన బృందం బాలుడి కుటుంబ సభ్యులను ఓదార్చింది.

కరూర్ మృతుల కుటుంబాలకు త్వరలో విజయ్ పరామర్శ


- 20 మందితో ప్రత్యేక కమిటీ

ప్యారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ త్వరలో పరామర్శించనున్నారు. ఇందుకోసం న్యాయవాదులు సహా, వివిధ రంగాలకు చెందిన 20 మందితో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. ఇటీవల కరూర్‌లో విజయ్ పాల్గొన్న రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, మరో 110 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం తలా రూ.10లక్షలు ఆర్థికసాయం అందజేసింది. టీవీకే తరుఫున తలా రూ.20 లక్షలు మృతుల కుటుంబాలకు, తలా రూ.2లక్షలు క్షతగాత్రులకు అందజేయనున్నట్లు ప్రకటించారు. కరూర్ ప్రాంతాన్ని సీఎం స్టాలిన్, రాష్ట్ర మంత్రులు, అఖిలపక్ష నేతలు, ఎన్డీయే కూటమి ఎంపీలు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, మురుగన్ సందర్శించి మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించి వెళ్లారు. గత నెల 27న జరిగిన ఈ దుర్ఘటనలో నష్టపోయిన కుటుంబాలను ఇప్పటివరక విజయ్ వెళ్లి పరామర్శించలేదనే ఆరోపణలు తల్లెత్తాయి. ఈ నేపథ్యంలో, త్వరలో కరూర్ వెళ్లాలని విజయ్ నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఐదుగురు న్యాయవాదులు, 15 జిల్లాల కార్యదర్శులతో ఆయన ఓ కమిటీ ఏర్పాటు చేశారు. విజయ్ కరూర్ వెళ్లేందుకు అనుమతి కోరుతూ న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌పై తీర్పు కోసం ఈ కమిటీ ఎదురుచూస్తోందని ఆ పార్టీ నిర్వాహకులు తెలిపారు.



రాజ్‌భవన్ భారతీయార్ మండపంలో శనివారం జరిగిన సంసార శుద్ధ సన్మార్గ యువజన సదస్సులో పాల్గొని వక్తలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

కుమరి ఎగ్జిబిషన్‌లో మోదీ మైనపు విగ్రహం



ఎగ్జిబిషన్‌లో ఉంచిన ప్రధాని మోదీ విగ్రహం

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి ఎగ్జిబిషన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మైనపు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కన్నియాకుమారి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో, ప్రపంచ, దేశీయ నేతలు, సినిమా ప్రముఖులతో కూడిన మైనపు విగ్రహాలున్నాయి. వాటిలో మహాత్మా గాంధీ, మదర్ థెరిస్సా, ఇందిరా గాంధీ, నెహ్రూ, మన్మోహన్‌సింగ్, అమితాబ్‌బచ్చన్, షారూక్ ఖాన్, జాకీచాన్, విజయ్, విరాట్ కోహ్లి, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి తదితరుల విగ్రహాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ విగ్రహాన్ని సందర్శనకు ఉంచారు.

అన్నాడీఎంకే బలం కార్యకర్తలే

- మాజీ ఈఎం ఎడప్పాడి పళనిస్వామి



పార్టీలో కొత్తగా చేరిన కార్యకర్తలతో ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే అన్నాడీఎంకే బలమని, పార్టీని ఎన్నికల్లో గెలిపించడంలో వీరిదే కీలకపాత్ర అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. ఈపీఎస్ చేపట్టిన ప్రచారయాత్ర శనివారం ధర్మపురి జిల్లాలోని మూడు నియోజకవర్గాల మీదుగా సాగింది. దండుకారన్‌పట్టి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 300 మంది ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. డీఎంకే ధర్మపురి జిల్లా ఐటీ విభాగం డిప్యూటీ ఆర్గనైజర్ డా.ఆనంద్ నేతృత్వంలో వి.మురుగన్, మణికంఠన్, కొంగునాడు మక్కల్ దేశియ పార్టీకి చెందిన నిర్వాహకులు, డీఎండీకేకు చెందిన ఎడియప్పన్, పీఎంకేకు చెందిన నటరాజన్, ఎండీఎంకే, డీపీఐ పార్టీలకు చెందిన కార్యకర్తలకు అన్నాడీఎంకే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ధర్మపురి జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి, మాజీ మంత్రి కేపీ అన్బళగన్, ఎమ్మెల్యే ముల్లైవేందన్‌లతో కలిసి అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలుపరిచిన 7.5 శాతం రిజర్వేషన్ కింద ఎంబీబీఎస్‌లో చేరి చదువుకుంటున్న 15 మంది విద్యార్థులను ఈపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొనే బహిరంగ సభలకు అనుమతులు కేటాయించడంలో రాష్ట్రపోలీసుశాఖ పక్షపాత వైఖరి చూపుతోందని మండిపడ్డారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులను మెజారిటీ స్థానాల్లో గెలిపించేలా ఇప్పటినుంచే సైనికుడిలా పనిచేయాలని ఈపీఎస్ సూచించారు.

భవంతిపై 'మెట్రో' పరుగులు

- షోళింగనల్లూరులో ప్రారంభం కానున్న పనులు



సీఎంఆర్‌ఎల్ విడుదల చేసిన నమూనా చిత్రం

ప్యారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోళింగనల్లూరులో రెండు రైలు మార్గాల్లో 8 అంతస్తుల భవనం మీదుగా మెట్రో రైలు నడపనున్నట్లు ప్రకటించిన చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) దానికి సంబంధించిన ఊహాచిత్రాన్ని శనివారం విడుదల చేసింది. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం కోసం చేపట్టిన రెండో విడత మెట్రోరైల్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో ఉత్తర చెన్నైలోని మాధవరం నియోజకవర్గం నుంచి సిప్కాట్ వరకు మూడు మార్గాల్లో, మాధవరం నుంచి దక్షిణ చెన్నై శివారులోని షోళింగనల్లూరులోని ఐదు మార్గాల్లో ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు ప్రజలు వేగంగా చేరుకునేలా షోళింగనల్లూరులో స్తంభాలపై మెట్రో రైల్వేస్టేషన్ ఏర్పాటుకానుంది. ఈ రైల్వేస్టేషన్ రెండు రైలు మార్గాలతో ఉండేలా పలు ప్రత్యేక అంశాలతో సీఎంఆర్‌ఎల్ ఇంజనీర్లు డిజైన్ చేశారు. ఈ రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం సమీపంలో 8 అంతస్తుల భవనం నిర్మించనున్నారు. ఈ భవనంలోపల నుంచి రెండు మార్గాల్లో మెట్రోరైళ్లను నడపనున్నారు. మాధవరం-షోళింగనల్లూరు మధ్య నడిపే రైళ్ల పై అంతస్తులో, మాధవరం-సిప్కాట్ మధ్య రైళ్లు కింద నడుపుతారు. ఈ ఎనిమిది అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో షాపింగ్ ప్లాజా, మూడో అంతస్తులో మాధవరం-సిప్కాట్ రైళ్లకు సంబంధించిన ప్లాట్‌ఫామ్, 4వ అంతస్తులో మాధవరం-షోళింగనల్లూరు రైళ్ల ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు.. ప్లస్ ఆకారంలో డిజైన్ చేసిన షోళింగనల్లూరు రైల్వేస్టేషన్ భవనంలో 6 నుండి 8 అంతస్తుల వరకు సీఎంఆర్‌ఎల్ కార్యాలయం, దుకాణాలు, క్యాంటీన్లుంటాయని సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు.



తండయార్‌పేట జోన్‌లో కొడుంగయూరు ప్రధాన కాల్వ వద్ద రూ.3.18 కోట్లతో గోడల ఎత్తు పెంచే పనులను పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో 'సముద్రపు నీరు'
హీరో సూరి సినిమా షూటింగులో ప్రమాదం
6లో



JEYACHANDRAN
FASHION | LIFESTYLE | APPLIANCES | FURNISHINGS | SUPERMARKET | GOLD & DIAMONDS
2 Lakh Square feet
Magnificent New Showroom
JEYACHANDRAN
From Today
@Keelkattalai
Near Madipakkam
INAUGURAL OFFERS
10% OFF Discount
10% Discount
for all textiles & readymades
(on October 5th only)
SLOGAN CONTEST
Participate in a Slogan contest & win
1000+ Prizes
including Car & Scooty
Assured Gifts
for every purchase
Special Inaugural offer for Gold, Diamond and Silver Jewellery
For every sovereign Gold Jewellery get a gift voucher worth Rs 4000*
(for textiles & readymades only)
DISCOUNT 10%
10% Discount
on diamonds for all diamond jewellery
Rs 1000 off for 1 kg silver
No making charges & Wastages for silver jewellery (Except a few items)
Platinum Jewellery
10% Discount
on making charges
www.yellowideas.in
* Terms & Conditions apply
Car Parking & Multi-cuisine Food Court Available
JEYACHANDRAN
FASHION | LIFESTYLE | APPLIANCES | FURNISHINGS | SUPERMARKET | GOLD & DIAMONDS
SCAN FOR LOCATION
• RANGANATHAN STREET • USMAN ROAD • PALLIKARANAI • TAMBARAM • KEELKATTALAI
ONLINE SHOPPING www.jeyachandran.com

సమాచార దర్శిని

పరిశోధన నిధులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చి (ఐసీఎస్ఎస్ఆర్) సాంఘిక శాస్త్రాల్లో పరిశోధకులకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఆ ప్రకారం, ఆర్థికాభివృద్ధి, సామాజిక సేవ, సంస్కృతి, రాజకీయ శాస్త్రం, ప్రజా పరిపాలన తదితర రంగాల్లో పరిశోధన చేస్తున్న సీనియర్ నిపుణులకు స్కాలర్‌షిప్ అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31 లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఎంపిక చేసిన పరిశోధకులకు నెలకు రూ.45వేల స్కాలర్ షిప్ అందించనున్నారు. వివరాలకు https:// icssr.org అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

గ్రామ సహాయకుల పోస్టులకు ...

గ్రామ సహాయకుల పోస్టులకు ఈ నెల 15వ తేదిలోగా దరఖాస్తులు సమర్పించాలి. ఈ మేరకు చెన్నై జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ప్రకటనలో.. చెన్నైలో ఖాళీగా ఉన్న 20 గ్రామ సహాయకుల పోస్టుల భర్తీకి ఉపాధి కల్పనా కార్యాలయం గత నెల 29వ తేది నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తాజాగా, ఈ నోటిఫికేషన్‌లో వయస్సు సడలించారు. ఆ ప్రకారం... జనరల్ విభాగాలు 21-32, బీసీ, ఎంబీసీలు 21-39, ఇతర విభాగాల వారికి 21 నుంచి 42 ఏళ్లు ఉండాలి. దరఖాస్తులను https: //chennai.nic.in/ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 15వ తేదిలోపు సంబంధిత రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా యంత్రాంగం తెలిపింది.

సైనిక కళాశాలలో ప్రవేశాలకు ...

భారత సైనిక కళాశాలలో 2026వ విద్యా సంవత్సరానికి 8వ తరగతితో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి ఈ నెల 15వ తేది దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టరేట్ అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లోని భారత సైనిక కళాశాలలో 2026వ విద్యా సంవత్సరం 8వ తరగతిలో అడ్మిషన్లకు డిసెంబరు 7వ తేది అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. చెన్నైలో కూడా పరీక్షా కేంద్రం ఏర్పాటుకానుంది. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లు కల్పించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తుల సమర్పణ, మోడల్ పేపర్లకు 'కమాండెంట్, రాష్ట్రీయ భారత సైనిక కళాశాల, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003' అనే చిరునామాకు స్పీడ్ పోస్టు ద్వారా దరఖాస్తులు, తగిన రుసుము పంపించాలి. జనరల్ విభాగం విద్యార్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ విభాగాల వారు రూ.555 పరీక్ష రుసుముగా చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులు ఈ నెల 15వ తేదిలోపు పంపించాలని, ఈ సమాచారాన్ని పాఠశాల విద్యార్థులకు తెలియజేయాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ సర్క్యులర్‌లో తెలిపింది.

వండలూరు జూకు పోటెత్తిన సందర్శకులు

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజ, వరుస సెలవుల కారణంగా వండలూరు జూ పార్క్‌కు సందర్శకులు పోటెత్తారు. మూడు రోజుల్లో 42,000 మంది సందర్శించారు. ఈ నెల 1వ తేది 12వేల మంది, 2న ఇరవై వేలు, శుక్రవారం పది వేల మంది సందర్శించారు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని జూ అధికారులు తెలిపారు.

రోడ్డు తవ్వకాలపై నిషేధం: జీసీసీ

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనున్న నేపథ్యంలో, నగరంలో మూడు నెలల పాటు రోడ్డు తవ్వకాలపై నిషేధం విధించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... ఈశాన్య రుతుపవనాలతో నగరం, శివారు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపింది. అందులో భాగంగా మెట్రోవాటర్ బోర్డు, విద్యుత్ బోర్డు తదితర సంస్థలు రోడ్లు తవ్వకుండా నిషేధం విధించామని తెలిపింది. అత్యవసర పనులకు రోడ్లు తవ్వేందుకు కార్పొరేషన్ అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించింది. అనుమతులు లేకుండా రోడ్డు తవ్వితే కఠిన చర్యలు చేపడతామని జీసీసీ హెచ్చరించింది.

8 నుంచి ఈపీఎస్ ఐదో విడత ప్రచారం

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' పేరుతో ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు విడతల ప్రచారం ఈపీఎస్ పూర్తిచేశారు. ఈ క్రమంలో, ఈపీఎస్ ఐదో విడత ప్రచారంపై పార్టీ ప్రధాన కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 8వ తేది నామక్కల్ జిల్లా తిరుచెంగోడు, కుమారపాళయం నియోజకవర్గాలు, 9న నామక్కల్ జిల్లా నామక్కల్, పరమత్తివేలూరు, 10వ తేది ఈరోడ్ కార్పొరేషన్ పరిధిలోని మోడకుర్చి, ఈరోడ్ (తూర్పు) శాసనసభ నియోజకవర్గాల్లో ఈపీఎస్ ప్రచారం చేపట్టనున్నట్లు పార్టీ తెలియజేసింది.

మెరుగైన సమాజం ఏర్పాటులో గురువులదే కీలకపాత్ర

- జస్టిస్ ఎస్‌కే కృష్ణన్
- ఘనంగా ఉత్తమ టీచర్ల పురస్కారం

పారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం ఏర్పాటులో గురువులదే కీలకపాత్ర అని సమాజంలో పూజింపబడేది గురువేనని మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎస్‌కే కృష్ణన్ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై జీకేడీ విలీనియం డిస్ట్రిక్ట్ 3241 సీ రీజియన్ సెకండ్ జోన్ 063878 ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొళత్తూరు మీనాక్షి నగర్‌లోని ఎవర్విన్ పాఠశాల ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ కె.కృపాసాగర్ అధ్యక్షత వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కే కృష్ణన్, గౌరవ అతిథులుగా ఎవర్విన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డా.వి.పురుషోత్తమన్, క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు ఎం.శ్రీధర్, పీవీ.ప్రకాష్‌కుమార్, సీఎస్.బాలమురుగన్, ఏఎస్వీ.శరవణకుమార్, ఆర్.సంతోష్ కన్నా, డా.ఎన్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 63 మందిని ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేశారు. వీరికి జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాలను


సంబరాల్లో ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ నిర్వాహకులు

అందించి ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతల్లో ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత ప్రాథమిక, కేటీసీటీ బాలిక మహోన్నత ప్రాథమిక పాఠశాలల టీచర్లు ఓరుగంటి లీలారాణి, ఇ.రమేష్, చుక్కా రేవతి, టి.మెర్సీ మనోరంజిని సహా 17 మంది టీచర్లు ఉన్నారు. క్లబ్ కార్యదర్శి లయన్ టి.గణేష్‌కాంత్, ట్రెజరర్ లయన్ కె.శివప్రకాశం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- కరూర్ ఘటన...

యూ ట్యూబర్ మారిదాస్ అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరూర్ ఘటనపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు పోస్ట్ చేసిన యూ ట్యూబర్ మారిదాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేశారంటూ 25 మందిపై చెన్నై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేశారు. వారిలో పెరుంబాక్కంకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సహాయం, టీవీకే నిర్వాహకులు మాంగాడు ప్రాంతానికి చెందిన శివనేశ్వరన్, ఆవడికి చెందిన శరత్‌కుమార్ తదితరులను అరెస్ట్ చేసిన పోలీసులు, మరో 22 మంది కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో, కరూర్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారంటూ యూ ట్యూబర్ మారిదాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. మదురై గోమతిపురంలోని మారిదాస్ ఇంట్లో శనివారం పోలీసులు తనిఖీలు చేయగా, ఆయన అక్కడ లేరని తెలిసింది. అనంతరం నీలాంగరైలోని ఇంటి నుంచి చేరుకున్న పోలీసులు, అక్కడ మారిదాస్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

పోలీస్ స్టేషన్ ముందు 'రీల్స్'

- ఇద్దరు యువకుల అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ పోలీస్ స్టేషన్ ముందు 'రీల్స్' చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేకే నగర్ పీటీ రాజన్ రోడ్డులో ప్రజలను భయభ్రాంతులను చేసేలా మోటారు సైకిల్‌పై సాహసాలు చేయడంతో పాటు, కేకే నగర్ పోలీస్ స్టేషన్ ముందు మోటారు సైకిల్ నిలిపి అసభ్య వార్తలతో 'రీల్స్' చేసిన ఇద్దరు యువకులు ఆ రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. మోటార్ సైకిళ్లలో వస్తున్న వీరిని ఆటో డ్రైవర్ బాబీ జోస్ అడ్డుకోగా, వారు అతడిపై దాడిచేసినట్లు సమాచారం. బాబీజోస్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన కేకే నగర్ పోలీసులు కేకే నగర్‌కు చెందిన ఆకాష్, గోకుల్ తదితరులను అరెస్ట్ చేసి, మోటార్ బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బాల్యవివాహం వ్యవహారంలో ఐదుగురిపై కేసు

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికకు వివాహం చేసిన వ్యవహారంలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. స్థానిక ఎన్నూర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికకు, పులియాంతోపు కన్నికాపురం ప్రాంతానికి చెందిన విఘ్నేష్‌కుమార్ (26)కు, బీసెంట్ నగర్ మాతా ఆలయంలో గత నెల 24వ తేది తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలో వివాహం జరిగింది. వివాహం ఇష్టం లేని బాలిక, తన స్నేహితురాలితో కలసి పిల్లల భద్రతా కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపి బాలికను ప్రభుత్వ హోంకు తరలించి, పులియాంతోపు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ప్రకారం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద విఘ్నేష్‌కుమార్, అతని తండ్రి దక్షిణామూర్తి, తల్లి మహేశ్వరి సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రూ.10లక్షల విలువైన సీ కుకుంబర్స్ స్వాధీనం

- రామనాథపురం తీరంలో గస్తీ ముమ్మరం

పారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం సముద్ర తీరంలో ప్రభుత్వం నిషేధించిన రూ.10 లక్షలు విలువచేసే 250 కిలోల సీ కుకుంబర్ (సముద్రపు దోసకాయ)ను మత్స్యశాఖ, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. తీరప్రాంతంలో స్మగ్లర్ల ఆగడాలను అడ్డుకునేందుకు గస్తీ పటిష్ఠం చేశారు. జిల్లా కేంద్రమైన రామనాథపురం చక్కరకోట సముద్రతీరం నుంచి సీ కుకుంబర్‌ను అక్రమంగా తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారంతో జిల్లా మత్స్యశాఖ అధికారులు పోలీసులతో కలిసి శనివారం ఉదయం ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సీ కుకుంబర్ తరలిస్తున్న ఓ పడవలో తనిఖీ చేసి, అందులో రూ.10లక్షల విలువైన సీ కుకుంబర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో స్మగ్లింగ్ ముఠాకు చెందిన ముత్తయ్యన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో పరారైన మరో ముగ్గురి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న సముద్రపు జీవులు

అత్యాచార బాధితురాలికి రూ.7.5 లక్షల పరిహారం

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతిద): తిరువణ్ణామలైలో పోలీసుల చేతిలో అత్యాచారానికి గురైన బాధితురాలికి తొలివిడతగా రూ.7.5 లక్షలు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్భయ నిధుల నుంచి ఈ పరిహారం విడుదల చేసినట్లు జీవో విడులైంది. ఆంధ్ర రాష్ట్రం నుంచి ఈ నెల 30వ తేది తిరువణ్ణామలై వచ్చిన యువతిపై పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటనకు కారణమైన ఇద్దరు పోలీసులను డిస్మిస్ చేశారు. ఈ క్రమంలో, బాధిత యువతికి రూ.7.5 లక్షల పరిహారం చెల్లించాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరువణ్ణామలై జిల్లా అధికారులు బాధితురాలికి పరిహారం అందజేసినట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

'సీఎం కప్' రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

వేలూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'సీఎం కప్'రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలు కలైంజర్ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి హాజరై పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ సుజాత, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ జనరల్ మేనేజర్ సుజాత, ఉప జనరల్ మేనేజర్ నెపోలియన్, జిల్లా క్రీడల అధికారి సుబ్రమణ్యన్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రవాహంలో చిక్కుకున్న తల్లి, కుమార్తె

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరద ప్రవాహంలో చిక్కుకున్న తల్లి, కుమార్తెను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. కోయంబత్తూర్ వాల్పారై, పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. కరుమలై ఎస్టేట్ ప్రాంతానికి చెందిన సీతాలక్ష్మి, కుమార్తె బిందుతో కలసి శుక్రవారం మధ్యాహ్నం వేలాంకన్ని మాత ఆలయం సమీపంలో నది మధ్యలో ఉన్న ఓ బండరాయిపై బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ఆ సమయంలో నదిలో వరద ఉధృతి అధికమైంది. నీటి ప్రవాహం అధికం కావడాన్ని గమనించిన వారిద్దరు మరో ఎత్తైన బండరాయిపై చేరుకున్నారు. ప్రవాహం అధికంగా ఉండడంతో వారు తీరానికి చేరుకోలేకపోయారు. భయంతో వారు 'కాపాడండి... కాపాడండి' అంటూ కేకలు వేశారు. అరగంట తరవాత వేలాంకన్ని మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చిన వారు తల్లీకూతుళ్లను గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకుని భారీ తాడు సాయంతో ఇరువురిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.


వరద ప్రవాహంలో చిక్కుకున్న దృశ్యం

విజయ్‌ను కూటమిలో చేర్చుకునేందుకు బీజేపీ యత్నం: సీమాన్

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షులు విజయ్‌ను కూటమిలో చేర్చుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ ఆరోపించారు. తిరుచెందూర్‌లో శనివారం సీమాన్ మీడియాతో మాట్లాడుతూ... సోదరుడు విజయ్ కరూర్‌కు రావడంతో ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చారన్నారు. కరూర్ ఘటనకు చింతిస్తున్నానని విజయ్ పేర్కొన్నారని, ఈ ఘటనకు ప్రభుత్వం, పోలీసు శాఖ బాధ్యత వహించాలన్నారు. విజయ్‌ను ఎలాగైనా కూటమిలోకి తీసుకురావాలని బీజేపీ ప్రయత్నాలు చేపట్టిందన్నారు. తమిళ జాతీయవాదం, ద్రవిడ వాదం ఒకటేనని విజయ్ చెబుతున్న మాటలు అంగీకరించమని, ఈ రెండు భిన్నమైనవని సీమాన్ తెలిపారు.

ఇంట్లో కూర్చుని రాజకీయాలు చేయలేరు

- విజయ్‌కు కృష్ణస్వామి సలహా

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అరెస్ట్‌కు భయపడి ఇంట్లో కూర్చుంటే రాజకీయాలు చేయలేరని టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు పుదియ తమిళగం పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వామి సలహా ఇచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సహజంగా ఏకసభ్య విచారణ కమిషన్ అధికార పార్టీ సూచనల ప్రకారమే నివేదిక ఇస్తుందన్నారు. కరూర్‌లో 41 మంది మృతిచెందడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. ఈ ఘటన ఆధారంగా విజయ్‌ను రాజకీయాల్లోకి రాకుండా చేయాలని కొందరు భావిస్తున్నారన్నారు. అరెస్ట్‌లకు భయపడి విజయ్ ఇంటి నుంచే రాజకీయాలు చేయడం సబబు కాదన్నారు. ధైర్యంగా బయటకు వచ్చి పరిస్థితులను ఎదుర్కోవడమే మంచిదని కృష్ణస్వామి సూచించారు.

మణిపూర్ ఘటన వేరు.. కరూర్‌లో జరిగింది వేరు

- బీజేపీ నేత ఖుష్బూ

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మణిపూర్ ఘటన వేరు... కరూర్ ఘటన వేరని బీజేపీ నేత, నటి ఖుష్బూ అభిప్రాయపడ్డారు. కరూర్‌లో గత నెల 27వ తేదిన టీవీకే అధ్యక్షులు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. ఈ ఘటనపై విచారించి వాస్తవాలు తెలుసుకునేలా బీజేపీ ఎంపీ హేమమాలిని నేతృత్వంలో 8 మంది ఎంపీల బృందాన్ని ఎన్డీఏ కూటమి ఏర్పాటుచేసింది. కాగా, కరూర్ ఘటనపై ఎంపీ బృందం విచారణపై సీఎం సహా పలు పార్టీల నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మారణకాండ, గుజరాత్ వంతెన కూలిన ఘటన, కుంభకోణం తొక్కిసలాట ఘటన తదితర వాటిపై విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయని ఎన్డీఏ కూటమి, కరూర్ ఘటన జరిగిన మరుసటిరోజే విచారణకు బృందాన్ని పంపడంపై వారు మండిపడ్డారు. ఈ క్రమంలో, సీఎం, మిత్రపక్షాల విమర్శలకు బీజేపీ నేత ఖుష్బూ స్పందిస్తూ... మణిపూర్ ఘటన వేరు... కరూర్ ఘటన వేరన్నారు. మణిపూర్ ఘటన తనను తీవ్రంగా బాధించిందన్నారు. విజయ్ విషయంలోనే ఎందుకు? సహా పలు ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రిని ఏదైనా ప్రశ్నగా అడినప్పుడల్లా మౌనంగా ఎందుకు ఉంటున్నారని? ఖుష్బూ ప్రశ్నించారు.

ఆయుధపూజ రోజున రూ.240 కోట్ల మేర మద్యం విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ 'టాస్మాక్' సంస్థ చిల్లర దుకాణాల్లో బీరు, మద్యం రకాలు విక్రయిస్తోంది. ఈ దుకాణాల్లో రోజుకు సరాసరిన రూ.150 కోట్లు, వారాంతపు సెలవుల్లో రూ.200 కోట్ల మేర మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. గాంధీ జయంతి సందర్భంగా గురువారం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించారు. ఈ కారణంగా ముందుగా మద్యం ప్రియులు అవసరమైన మద్యం బుధవారమే కొనుగోలు చేశారు. ఈ కారణంగా బుధవారం ఒకేరోజు రూ.240 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయని టాస్మాక్ అధికారులు తెలిపారు.


వేలూరు శ్రీపురంలోని స్వర్ణాలయాన్ని సందర్శించి శక్తి అమ్మ నుంచి ఆశీస్సులు అందుకుంటున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

వేలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శని ప్రదోషం సందర్భంగా నగరంలో ఆధ్యాత్మిక స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి వడ, పాయసంతో కూడాన వంటకాలతో అన్నదానం నిర్వహించినట్లు సంఘం నిర్వాహకులు తెలిపారు.

హీరో సూరి సినిమా షూటింగులో ప్రమాదం

అడయార్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య నటుడు సూరి హీరోగా నటిస్తున్న తాజా 'మండాడి' సినిమా షూటింగులో అపశ్రుతి జరిగింది. ఈ చిత్ర షూటింగులో భాగంగా కొన్ని సన్నివేశాలను సముద్రంలో చిత్రీకరిస్తుండగా, సాంకేతిక నిపుణులు ఉన్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోటి రూపాయల విలువ చేసే కెమెరాలు, ఇద్దరు వ్యక్తులు నీట మునిగిపోయారు. రామనాథపురం జిల్లా తొండి అనే సముద్రతీర ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. అయితే, యూనిట్ సభ్యులు నీట మునిగిన వ్యక్తులను రక్షించడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే విలువైన కెమెరాల సహా ఇతర సామాగ్రి నీట మునిగిపోయింది.

తిరుత్తణిలో 'నలంకాక్కుమ్ స్టాలిన్' శిబిరం


కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని ఆకూర్ పంచాయతీలోని ప్రైవేటు పాఠశాలలో శనివారం 'నలంకాక్కుమ్ స్టాలిన్' శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందజేసి, వృద్ధులకు, కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లజోడులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహాకవి భారతీయార్ భవన, అసంఘటిత కార్మికుల సంఘ రాష్ట్రఅధ్యక్షురాలు ధనలక్ష్మి, జిల్లా వైద్య విభాగం జాయింట్ డైరెక్టర్ ప్రియా రాజన్, జిల్లా డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో 'సముద్రపు నీరు'

పెరంబూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా శివన్‌మలైలోని సుబ్రమణ్యస్వామి కొండ ఆలయంలోని అద్దాల పెట్టెలో 'సముద్రపు నీరు' ఉంచి పూజలు చేస్తున్నారు. ఈ అద్దాల పెట్టెను 'ఆండవన్ ఉత్తర్వులు' అని భక్తులు పిలుస్తుంటారు. ఈ పెట్టెలో ఏదైనా వస్తువు ఉంచి పూజలు చేస్తుంటారు. పెట్టెలో ఏ వస్తువు ఉంచాలో మురుగన్ ఎవరైనా భక్తుడి కలలో కనిపించి చెబుతుంటారని నమ్మకం. ఈ క్రమంలో, కోవై జిల్లా మణియకారంపాళయం గ్రామానికి చెందిన ఓ భక్తురాలి కలలో కనిపించిన స్వామివారు, పెట్టెలో సముద్రపు నీరు ఉంచాలని సూచించారు. భక్తురాలు ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు చెప్పగా, శనివారం సముద్రపు నీటిని కలశంలో ఉంచి పూజలు చేసి అద్దాల పెట్టెలో ఉంచారు. తదుపరి ఎవరైనా భక్తుల కలలో స్వామివారు దర్శనమిచ్చి సూచించే వరకు సముద్రపు నీటికి పూజలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


అద్దాల పెట్టెలో సముద్రపు నీటికి పూజలు

7న నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా 7వ తేదీ మంగళవారం రోజున నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తమిళనాడు విద్యుత్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు...

మైలాపూర్: ఆర్‌కేమఠ్ మెయిన్‌రోడ్డు, 2 నుంచి 9 వీధులు, పీఎస్ శివస్వామివీధి, వీరపెరుమాళ్ కోవిల్‌వీధి, బంగారు అమ్మాళ్ కోవిల్ వీధి, అప్పర్‌స్వామి కోవిల్‌వీధి, చిదంబర స్వామి ఆలయ 1 నుంచి 3 వీధులు, ఇంద్రాణి అమ్మాళ్ వీధి, నాగరత్నంరోడ్డు, బాలసుబ్రమణ్యం వీధి, పల్లూరు కన్నయప్పన్‌వీధి, భీమసేనాగార్డెన్, కర్పగాంబాల్ నగర్, శ్రీ పురం స్ట్రీట్, శ్రీ కృష్ణాపురం రోడ్డు, లియోడ్స్‌లైన్, ఆపకన్నువీధి, వీఎంస్ట్రీట్, టీటీకేరోడ్డు, జెజెమొదల్‌వీధి, ద్వారకా కాలనీ, బృందావనం వీధి, గణేష్‌పురం, బాలకృష్ణన్‌రోడ్డు, నయినార్ నాడార్‌రోడ్డు, నటేశన్‌రోడ్డు, కాణనీశ్వరర్ ఆలయ వీధి.

పల్లావరం: దుర్గానగర్, టీఎన్‌హెచ్‌బీకాలనీ, చెల్లియమ్మన్‌కోవిల్‌వీధి, చంద్రానగర్, సీఎల్‌సీరోడ్డు.

ఆవడి: పాండేశ్వరం కలైంజర్‌నగర్, కోవిల్‌పాత్తై మెయిన్‌రోడ్డు, హుంబోలిల్‌నగర్, మసీదువీధి.

తిరుమలైవాయిల్: సీటీహెచ్ మెయిన్‌రోడ్డు, చోళంబేడు మెయిన్‌రోడ్డు, సెంథిల్‌నగర్, నేతాజీనగర్, వీవోసీరోడ్డు, మణికంఠపురం 1 నుండి 16వీధులు, కలైంజర్ నగర్ 1 నుంచి 3 వీధులు, వేణుగోపాల్ నగర్, గణేశ్‌నగర్.

పూందమల్లి: పూందమల్లి బైపాస్‌రోడ్డు, పారివాక్కంరోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగనుందని తమిళనాడు విద్యుత్ బోర్డు ప్రకటించింది.

వైభవంగా పురటాసి శనివారం వేడుకలు

- వేంకటేశ్వర భక్తజన సభలో ప్రత్యేక పూజలు


పూజా కార్యక్రమంలో శరత్‌కుమార్, హరికృష్ణ తదితరులు

ప్యారీస్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాస పెరుమాళ్ ఆలయాల్లో పురటాసి నెల మూడో శనివారం పూజలు వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామివారికి పురటాసి మాసంలో నాలుగు శనివారాల్లో విశేషపూజలు నిర్వహించడం ఆనవాయితీ. కొరుక్కుపేట ఏకాంబరచెట్టివీధిలో ఉన్న వేంకటేశ్వర భక్తజన సభ ఆధ్వర్యంలో 35వ వార్షిక పురటాసి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదికపై పద్మావతి తాయారు సమేత వేంకటేశ్వరస్వామి ప్రతిమలను కొలువుదీర్చి అలంకరించారు. సుబ్బారావు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సహపంక్తిలో 1,500 మందికి పైగా పాల్గొన్నారు. నిర్వాహకులు కేబీ.శరత్ కుమార్, సీనియర్ న్యాయవాది జక్కుల హరికృష్ణ, అర్చకులు దేవీ మాధవయ్య, బాబు, ఆర్.లోకనాథం, ఎంఎస్.గణేష్, పి.మనోహర్, సంగీత దర్శకుడు ఎంఆర్.సుబ్రమణ్యం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వేడుకల్లో భాగంగా స్వామివారిని కొరుక్కుపేట ప్రాంతంలోని వీధుల్లో ఊరేగించారు.

స్పెల్‌బీ ఇంటర్నేషనల్ పోటీల్లో ఆరుగురు విద్యార్థులకు టాప్‌త్రీ ర్యాంకులు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్పెల్‌బీ ఇంటర్నేషనల్ సంస్థ ఆంగ్ల భాషకు సంబంధించి జాతీయ స్థాయిలో 1 నుండి 9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీలో రాష్ట్రానికి చెందిన ఆరుగురు టాప్ త్రీ ర్యాంకులు సాధించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ మేరకు వేలూరు ఐడీఐ స్కడ్డర్ స్కూలు విద్యార్థిని బీఎస్ దర్శిని, మహేంద్రా వరల్డ్ సిటీ మహేంద్రా స్కూల్ విద్యార్థిని ఐశ్వర్యా దీపక్, చెన్నై రాజకాళిపాక్కం కంచి మహర్షి విద్యామందిర్ విద్యార్థిని నిఖిల్ ప్రసన్న ప్రభు, అరుంబాక్కం కోలా పెరుమాళ్ చెట్టి వైష్ణవ్ సీనియర్ సెకండరీ స్కూలు విద్యార్థి హెచ్ రిథున్, మధురవాయల్ ద్విశామ్ అకాడమీ విద్యార్థి మెర్విన్ డేవిడ్ ముల్లెన్స్, కాంచీపురం పడూరుకు చెందిన గేట్‌వే ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థిని ఎ. ఆరాధనా ప్రిన్సి ర్యాంకులు పొందినట్లు ప్రకటించింది.


దర్శిని, నిఖిల్ ప్రసన్న

తిరుపత్తూరులో అగర్వాల్ ఐ కేర్ సెంటర్ ప్రారంభం



అడయార్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన తిరుపత్తూరులో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ అడ్వాన్స్‌డ్ ఐ కేర్ సెంటర్‌ను నెలకొల్పగా జోలార్‌పేట ఎమ్మెల్యే కె.దేవరాజి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపత్తూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగీత, తిరుపత్తూరు మున్సిపాలిటీ సెక్రటరీ రాజేంద్రన్, ఐ కేర్ సెంటర్ రీజినల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐజాక్ అబ్రహాం రాయ్, బ్రాంచ్ హెడ్ డాక్టర్ జి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు ఉచిత సమగ్ర నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ వైద్య సేవలను ఉపయోగించుకునే వారు 730 597 4932 అనే ఫోన్ నెంబరులో సంప్రదించి తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంది.

షెరన్ ప్లై ఆధ్వర్యంలో మాజీ సైనికాధికారులకు సత్కారం



సత్కారం అందుకున్న మాజీ సైనికాధికారులతో షెరన్ ప్లై ఎండీ విష్ణు ఖేమణి

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లైవుడ్ తయారీలో పేరెన్నికగన్న షెరన్ ప్లై సంస్థ నగరంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'భారత దేశ కీర్తి ప్రతిష్ఠతలకు అండగా నిలిచి పరిరక్షించాం' అనే నినాదంతో నలుగురు మాజీ సైనికాధికారులను ఘనంగా సత్కరించింది. 'ఐ యామ్ స్ట్రాంగెస్ట్' పేరుతో మాజీ సైనికాధికారులు లెఫ్టినెంట్ జనరల్ ఎస్.హరిమోహన్ అయ్యర్, లెఫ్టినెంట్ జనరల్ దుష్యంత్ సింగ్, లెఫ్టినెంట్ జనరల్ పీఆర్.శంకర్, మేజర్ జనర్ రాజీవ్ నారాయణన్‌కు అవార్డులను ప్రదానం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు ఖేమణి తెలిపారు.